తేదీ 18.08.2006, అతిరుద్ర మహాయజ్ఞము, సాయికుల్వంత్ హాలు

# దేహభ్రాంతిని విసర్జించాలి,
# దైవాభిమానాన్ని పెంచుకోవాలి

**పుస్తకముల్ పఠించితిని పూర్తిగ జూచితి సర్వ శాస్త్రముల్**
**నిస్తులమైన విద్యలను నేర్చితినంచును గర్వమేల? నీ**
**హస్తయుగంబు మోడ్చి పరమాత్ముని భక్తితొ కొల్వలేని నీ**
**ప్రస్తుత విద్యలన్నియు ధాత్రి నిరర్థకము గాదె మానవా!**

ఈ ప్రకృతియందు విద్యలెన్ని నేర్చినను విలువ సున్న. కాని, తెలియలేక మానవులు తెలివి తప్పి గర్వపడుతున్నారు. ఎన్ని విద్యలు నేర్చియు ఏమి ఫలము? ఈ విద్యలయందు ఉన్న ఫలము ఏమని తెల్పుదు ఈ సభయందు?

**ఆర్య ధర్మములెల్ల ఆరిపోయె**
**తల్లి భాషను మాటాడ తప్పు తోచె**
**సంఘ మర్యాద పాటింప జంకు పుట్టె**
**భారతావని ధర్మ భాగ్యంబు కాపాడ**
**బాధ్యతంతయు మీదె భక్తులార!**

ప్రేమస్వరూపులారా! ఈనాడు లోకములో  కాలమే తెలియనివిధంగా అన్నీ త్వరితగతిన జరిగిపోతున్నాయి. చూస్తూ ఉండగనే క్షణములు, ఘడియలు దాటిపోతున్నవి. అరవై క్షణములైతే ఒక నిమిషము. అరవై నిమిషములైతే ఒక గంట. కాని, ఈనాడు క్షణములో గంటలు మారిపోతున్నవి. దీనికి కారణ మేమిటి? మానవునియొక్క మనస్తత్త్వమే. మానవుని మనస్సు క్షణక్షణమునకు మారిపోతున్నది. "మనయేవ మనుష్యాణాం కారణం

srisathyasaivachanamrutam

బంధమోక్షయోః" మనస్సే బంధ, మోక్షములకు మూలకారణం. అసలు మనస్సంటే ఏమిటి? కోరికల మూట (bundle of desires). ఈ కోరికలను మనము కొంతవరకు అరికట్టుకోవాలి. మానవుడీనాడు అన్నింటినీ అరికట్టగల్గుతున్నాడుగాని, తనను తాను అదుపులో పెట్టుకోలేకపోతున్నాడు. అన్నింటినీ అదుపులో పెట్టి తాను మాత్రం అదుపు తప్పి తిరుగుతుంటే ఏమి ప్రయోజనం?

**మనస్సును భగవంతునికి అర్పితం గావించాలి**

ప్రేమస్వరూపులారా! మొట్టమొదట మనస్సును భగవంతునికి అర్పితం చేయాలి. మనస్సు భగవత్ వరప్రసాదం. భగవంతుడిచ్చిన మనస్సును తిరిగి భగవంతునికే అర్పితం చేయాలి. ఈవిధమైన క్రమ పద్ధతిని మనము అనుసరించినప్పుడే సంపూర్ణమైన ఆనందమును అనుభవించవచ్చును.

**జనని గర్భమునుండి జన్మించినప్పుడు**
**కంఠమాలలవేమి కానరావు**
**మంచి ముత్యపు సరుల్ మచ్చునకును లేవు**
**మేల్మి బంగరుదండ మెడకు లేదు**
**రత్నాల హారముల్ రంజిల్లగా లేవు**
**పచ్చలు కెంపులు పొదగ లేదు**
**వజ్రాల హారముల్ వర్ధిల్లగా లేవు**
**గోమేధికంబులు తోడ లేవు**
**కలదు కలదొక్క మాల మీ కంఠమందు**
**ఎన్ని చేసిన అవియన్ని ఎంచి ఎంచి**
**మంచియైనను చెడుగైన త్రుంచకుండ**
**బ్రహ్మ మీకిచ్చి పంపును బరువు మాల**
**కర్మలన్నియు చేర్చిన కంఠమాల**

ఈ సృష్టి అంతయు భగవంతుని వరప్రసాదమే. ఇట్టి వరప్రసాదమును మనము



sri sathyasaivachanamrutam

భద్రంగా కాపాడుకోవాలి. మానవునికి మూడు గుణములున్నవి. ఒకటి సాత్త్విక గుణము, రెండవది రజో గుణము, మూడవది తమోగుణము. సాత్త్విక గుణాన్ని మనము భద్రంగా పెట్టుకోవాలి. దుష్టచింతన చేసెడి దుర్మార్గునకు అంతటా దుష్టత్వమే కనిపిస్తుంది. మంచి భావాలు కలిగిన మనుజునకు సర్వత్రా మంచి దృశ్యములే కనిపిస్తుంటాయి. ఎటువంటి సంకల్పములూ లేని మానవుడు మాత్రమే పరిపూర్ణుడై, నిత్యుడై శాంతిని పొందగలడు. దారములు పడుగు, పేకగా చేరడంచేతనే వస్త్రము తయారవుతుంది. కర్మఫలితమనే త్రాడు ఎక్కడినుండి వచ్చింది? జన్మాంతర సంస్కారములనే ప్రత్తినుండి వచ్చింది. ప్రత్తినుండి దారము తీసి, దారమును వస్త్రముగా నేసి దానిని మనము ధరిస్తున్నాము. మనం ధరించినటువంటి దేహమనే వస్త్రముకూడా భగవంతుని వరప్రసాదమే.

**ఉభయభారతి జ్ఞానబోధ**

ఉభయభారతి మహాజ్ఞాని. ఆమె మండనమిశ్రుని భార్య. ఒకనాడామె తన శిష్యురాండ్రతో కూడి గంగానదికి వెళుతుంటే మార్గమధ్యంలో ఒక చెట్టు క్రింద ఇసుకపై పరుండిన ఒక సన్యాసిని చూసింది. అతడు సర్వసంగపరిత్యాగి. ప్రజలు అతనిని 'బ్రహ్మజ్ఞాని' అని పిలిచేవారు. అయితే, తాను నీరు త్రాగడానికి ఉపయోగించే మట్టికుండను ఎవరైనా దొంగిలిస్తారేమో అనే భయంచేత అతడు దానిని తలక్రింద పెట్టుకొని పడుకున్నాడు. అది చూసి ఉభయభారతి "అయ్యో పాపం, నేను ఇతనొక మహాత్యాగి అనుకున్నాను. కాని, తన నీటికుండపై అతనికింకా అభిమానం పోలేదు. కాబట్టి, ఇతను సర్వసంగ పరిత్యాగి కాదు", అని అతను వినేటట్లుగా గట్టిగా చెప్పింది. ఆమె మాటలు అతనికి కోపం తెప్పించాయి. వాళ్ళు గంగలో స్నానమాచరించి తిరిగి వస్తూండగా అతడా కుండను తీసి విసిరేశాడు. అప్పుడు ఉభయభారతి, "అయ్యో, ఇతనిలో అభిమాన మొక్కటే ఉన్న దనుకున్నాను, అహంకారముకూడా ఉన్నది", అన్నది. అప్పుడతను తన పొరపాటును గ్రహించి, లేచి ఉభయభారతి పాదాలపై పడి, 'అమ్మా! మీరీనాడు నాకు కన్నులు తెరిపించారు", అన్నాడు. అప్పుడు ఉభయభారతి, 'నాయనా! ఈ ప్రపంచ మంతయు కేవలం భ్రమతో కూడినటువంటిది. ఈ ప్రపంచంలోని అనేక విధములైన రూపములు మానవుణ్ణి ఆకర్షిస్తున్నవి. అయితే, అవన్నీ మనలోనుంచి వచ్చినటువంటివేగాని, ఎక్కడో

sri sathyasai vahini amrutam

బయటి నుండి వచ్చినటువంటివి కావు. ప్రతి ఒక్కటీ నీకై నీవే కల్పించుకుంటున్నావు. కొంతకాలము నీ దేహమును నీవు ప్రేమిస్తున్నావు. ఆ తరువాత నీ దేహమును నీవే విసర్జిస్తున్నావు. దేహమును వరించేదీ నీవే! విసర్జించేదీ నీవే! వరించడంగాని, విసర్జించడంగాని భ్రాంతులే! దేహభ్రాంతిని విసర్జించి దైవాభిమానమును అభివృద్ధిపరచుకో. దేహమే దైవమందిరం. దేహిని దేవదేవునిగా భావించు", అని బోధించింది.

**దేహము పాంచభౌతికముదేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్**
**మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ యా**
**దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!**

ప్రాపంచికమైన భావములన్నీ అజ్ఞాన జనితమైనవి. ఇవి సత్యమైనవి కావు, నిత్యమైనవి కావు. ప్రాణము ఉండినంతవరకు ఒక దేహము మరొక దేహాన్ని ప్రేమిస్తుంది. దేహము ఉండినంతవరకు భర్త భార్యను ప్రేమిస్తాడు. ఈ ప్రేమ కేవలం దేహసంబంధమైనది. రెండు దేహములూ ఒకేతూరి రాలేదు, ఒకేతూరి పోవు.

**పునరపి జననం పునరపి మరణం**
**పునరపి జననీ జఠరే శయనం**
**ఇహ సంసారే బహు దుస్తారే**
**కృపయా పారే పాహి మురారే**
**భజ గోవిందం భజ గోవిందం**
**గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితే కాలే**
**నహి నహి రక్షతి దుకృఞ్ కరణే**

మానవుడీనాడు మంచి పుష్టిగా, సంతుష్టిగా ఉండవచ్చును. కాని, రేపటి దినం ఏవిధంగా మారుతుందో చెప్పలేము. దేహము ఒక కారు వంటిది. మనస్సే స్టీరింగు. తన మనస్సే తన స్వాధీనంలో లేనప్పుడు దేహము తన స్వాధీనంలో ఎలా ఉండగలదు?

sri sathyasai vachanamrutam

**భగవంతుణ్ణి చేరుకోవడం చాలా సులభం**

ప్రేమస్వరూపులారా! ఈ పది దినములనుండి ఇక్కడ చేరి యజ్ఞములో పాల్గొన్న ఋత్విక్కులలో ప్రతి ఒక్కరి స్వభావమూ ఎంతో గొప్పది. వాళ్లలో ఎన్ని విధములైన భావములు ఉండినప్పటికీ భగవత్ విషయంలో వారి హృదయం నిశ్చలంగా ఉన్నది. ఇందులో ఎందరో యువకులుకూడా ఉన్నారు. 'యూత్' (యువత) దేశానికి ఎంతో అవసరం. 'యూత్'ని చూస్తే నాకెంతో ఆనందం కలుగుతుంది. వాళ్లకు ఏది కావలసినా నేనిస్తాను. పూర్ణాహుతి తరువాత నేను మీతో మాట్లాడి, మీ అభీష్టములను నెరవేర్చి మీతో ఆనందమును అనుభవిస్తాను. మీలో ఎందరికో వైరాగ్యభావమున్నది. కాని, కొన్ని బంధనలను వదలలేక మీరు ఇబ్బందిపడుతున్నారు. ఈ 'అటాచ్‌మెంట్'ను చాలా సులభంగా విడిచి పెట్టటానికి తగిన మార్గమును మీకు చెబుతాను. మన ప్రధాన అర్చకుడే మీకందరికీ మార్గదర్శి. ఆయన ప్రతి ఒక్కటి తాను అనుభవించి, ఆనందించి మీకు దారి చూపుతున్నాడు. తాను చెప్పే ప్రతి విషయాన్ని ఆచరణలో పెట్టి జీర్ణించుకున్నాడు. అటువంటి ఆచార్యుని మీరు అనుసరించినప్పుడు ఎలాంటి అవరోధమునైనా సులభంగా అధిగమించి గమ్యం చేరుకోవచ్చును. మీరు భగవంతుణ్ణి చేరుకోవడం చాలా సులభం. భగవంతుడు మీవాడే. మీరు భగవంతునివారే. తండ్రికి బిడ్డకు మధ్య ఎటువంటి సంబంధమున్నదో అటువంటిదే మీకూ నాకూ మధ్య ఉన్నటువంటి సంబంధము. కనుక, మీరు ఆనందంగా, ధైర్యంగా, సంతోషంగా కాలమును గడపండి.

మరో రెండు దినములలో మిమ్మల్ని ఇక్కడినుండి పంపుతున్నానే అని నాకు చాలా కష్టంగా ఉంటున్నది. నేనుకూడా మీ వెంటే వస్తాను. మనము ఒకరి నొకరము వీడి ఉండలేము. ఇట్టి సన్నిహిత సంబంధ బాంధవ్యమును నిత్య సత్యమైనదిగా భావించి మీరు నిలబెట్టుకొనుటకు ప్రయత్నించాలి.

**(తేదీ 18.08.2006, అతిరుద్ర మహాయజ్ఞము, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasaivachanamrutam